క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరిబీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 21, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 19, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 3–4, ముల్లంగి 3–5. ఈ ధరలు బుధ వారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

క్రీడలతో మానసికోల్లాసం



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో క్రికెట్ కోచ్ రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి శిక్షణ శిబిరాల ద్వారా ఎంతో మంది ఉన్నత క్రీడాకారులుగా ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని చిన్నారులు ముందుకు సాగాలన్నారు. అండర్-19లో వివేక్, అండర్-14లో ప్రేమ్ తెలంగాణ రాష్ట్రం తరుపున వివిధ టోర్నమెంట్లలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలను బాల్‌రెడ్డి, షఫీ, ఇమ్రోజ్, సురేందర్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వెనకాల ఉన్న బ్రాహ్మణ వీధిలో వర్షపు నీటిని మళ్లించేందుకు ఎట్టకేలకు ప్రత్యేకంగా పైప్‌లైన్ వేయడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డిప్యూటీ ఈఈ మోహన్‌తో కలిసి పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, రాయల సేవా సమితి అధ్యక్షులు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ.. శ్రీరాంనగర్‌లోని బ్రాహ్మణ వీధిలో వర్షం కురిసిన ప్రతీ సారి వరద నీరు రోడ్డుపై నిలిచేదన్నారు. త్వరలో జరగబోయే ఎల్లమ్మ కల్యాణం నేపథ్యంలో వీడీసీసీ రోడ్డు పనులు చేపట్టారని చెప్పారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు వరద నీరు వెళ్లేందుకు వీలుగా పెద్ద పైప్‌లైన్ వేసి 60 అడుగుల రోడ్డులోని కాలువలో కలపడం సంతోషదాయకమన్నారు.

ఘనంగా రైల్వే డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



లాలాపేట: విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తూ రైల్వే డిగ్రీ కళాశాల పేరును మరింత ఇనుమడింపజేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్(పీసీపీఓ) రాజీవ్ కిషోర్ అన్నారు. తార్నాకలో రైల్వే డిగ్రీ కళాశాల 46వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల అభివృద్ధి, విద్యార్థులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా రైల్వే ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విమ్మి కిషోర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్ కాశీనాథ్, జంషీద్ చౌదరీ, కవిత, రామశాస్త్రి, విజయ్‌కుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. అడ్డగుట్టలోని శాస్త్రినగర్‌కు చెందిన గణేష్ (25) ప్రైవేటు ఉద్యోగి. కొంతకాలంగా కుటుంబంలో జరుగుతున్న చిన్న చిన్న గొడవల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో 15 రోజుల పాటు ఉచిత కాలిగ్రఫీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వేమూరి తాండవ కృష్ణ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈనెల 10 నుంచి 25 వరకు రోజూ ఉదయం 7:30 గంటల నుంచి 8:30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. 10 ఏళ్ల నుంచి 15 ఏళ్ల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారుణ్యంపై కనికరించరా!

- 750 ఉద్యోగాలకు 300 మందే సిబ్బంది
- ఏళ్ల తరబడి ఎదురు చూపులే..
- వెయిటింగ్ లిస్టులో 120 మందికి పైనే



బోర్డు సభ్యుడు రామకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న బోర్డు ఉద్యోగ సంఘం ప్రతినిధులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నాలుగో తరగతి ఉద్యోగాలు నియామకాలకు దాదాపు తిలోదకాలు ఇచ్చారు. 35 ఏళ్లుగా నియామకాలే లేకపోవడంతో 750 పోస్టులకు గానూ ప్రస్తుతం కేవలం 300 మంది సిబ్బందే ఉన్నారు. ఇన్నేళ్లలో సుమారు 300 మంది రిటైర్‌మెంట్ తీసుకోగా, అందులో సగం మంది (148) విధుల్లో కొనసాగుతుండగానే మృతి చెందడం గమనార్హం. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో పని చేస్తూ విధుల్లో ఉండగానే మృత్యువాత పడిన వారి స్థానంలో వారసులకు ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా బోర్డు ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో గత పాతికేళ్లలో మరణించిన 148 సిబ్బంది కుటుంబ సభ్యుల్లో కేవలం 28 మందికి మాత్రమే 2010లో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. నాటి నుంచి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. తాజాగా మరోసారి ఆందోళన బాట పట్టారు.

నిపివేతతో ఇబ్బందే..

బోర్డు అధికారులు 35 ఏళ్లుగా కొత్తగా నాలుగో తరగతి నియామకాలకు స్వస్తి పలికారు.ఇటీవల 65 మందిని మాత్రమే కొత్తగా నియమించారు. వీరిలో 26 మంది జూనియర్ అసిస్టెంట్‌లు కాగా, 2010లో కారుణ్య నియామకాల కింద మరో 28 మందికి ఉద్యోగం కల్పించారు. ఇక మిగతా వారిలో దాదాపు పది మంది ఇంజినీర్‌లు ఉన్నారు. వీరిలో ఆరుగురు గతేడాదే నియామకమై ప్రొబేషనరీ పిరియడ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా కంటోన్మెంట్‌ల ఆర్థిక పరిస్థితి ఎంత మాత్రమూ బాగా లేదని, ఈ పరిస్థితిల్లో కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దంటూ రెండు నెలల క్రితమే రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కూడా ఉంది. అంటే ఇకపై సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కొత్తగా ఎలాంటి నియామకాలు చేపట్టే అవకాశం లేదు. ప్రతీయేటా అందుబాటులో ఉన్న ఖాళీల భర్తీ చేపడితే అందులో కేవలం ఐదు శాతం మందికి మాత్రమే కారుణ్య నియామకాల కింద ఉద్యోగం కల్పించే వీలుంది. అయితే సికింద్రాబాద్‌లో ఈ జాబితా 120మందికి పైగా ఉండటంతో కొన్నేళ్లుగా అధికారులు ఎవరికి ముందు అవకాశం కల్పించాలో తెలియక సతమతం అవుతూ వచ్చారు. తాజాగా రక్షణ శాఖ ఉత్తర్వులో అసలు నియామకాలే చేపట్టే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రక్షణ శాఖ ఉన్నతాధికారులు కారుణ్య నియామకాల కోసం ప్రత్యేక ఉత్తర్వులు ఇస్తేనే బోర్డు మాజీ ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు వస్తాయి.

బోర్డు సమావేశంలో లేవనెత్తండి..

కారుణ్య నియామకాలు చేపట్టాల్సిందిగా బోర్డు ఉద్యోగ సంఘం నేతలు మహేందర్, పరుశరామ్ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా రక్షణ శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. తాజాగా బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిని కలిసి ఉద్యోగ సంఘం నేతలు బుధవారం నాటి బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తాల్సిందిగా కోరారు. సానుకూలంగా స్పందించిన రామకృష్ణ తప్పకుండా బోర్డు మాజీ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

నేడే బోర్డు సమావేశం

వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చిన బోర్డు సమావేశం ఎట్టకేలకు బుధవారం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. బోర్డు అధ్యక్షుడు సోమశంకర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పాల్గొంటారు. బోర్డు పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, టెండర్ల ఖరారు, భవన నిర్మాణ అనుమతులు, కొత్తగా చేపట్టబోయే పనులకు బోర్డు తీర్మానం తప్పనిసరి. బుధవారం నాటి బోర్డు సమావేశంలో రోడ్లు, కమర్షియల్ భవనాలతో పాటు వివిధ కాలనీల్లోనూ ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల భద్రతతో పాటు వాటి ద్వారా బోర్డుకు ఆదాయం వచ్చే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

మురుగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో మురుగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. మైలార్‌గడ్డలో చేపట్టిన సివరేజీ పైప్‌లైన్ క్లీనింగ్ పనులను మంగళవారం ఆమె జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్‌తో కలిసి పరిశీలించారు. మ్యాన్‌హోళ్లు పొంగినా, కలుషిత జలాలు సరఫరా ఐతే తక్షణమే తనకు లేదా జలమండలి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. శిథిలావస్థకు చేరిన సివరేజీ, మంచినీటి పైప్‌లైన్లను తొలగించి, వాటి స్థానంలో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.



పూజలో పాల్గొన్న మన్నె క్రిశాంక్



హనుమాన్ మహాపూజలో శ్రీగణేష్

ఘనంగా మహాపూజ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రసిద్ధిగాంచిన అన్నానగర్‌లోని పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం మహాపూజ జరిగింది. గణపతి పూజ, స్వస్తివాచనం, విశేష ద్రవ్యాలతో ఆంజనేయ స్వామికి మహాభిషేకం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయనం, హారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీగణేష్, బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎన్. శ్రీనివాస్‌లు, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎస్. శ్రీనివాస్‌లు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో అనిల్, కష్ణ, శ్రీనివాస్, సత్యం, రవి పాల్గొన్నారు.

'దర్శన్ బస్సు'ను సద్వినియోగం చేసుకోవాలి



దర్శన్ బస్సుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ నగర విశిష్టత, విశేషాలను, ప్రాచీన కట్టడాలను హైదరాబాద్ అందాలను తిలకించేందుకు ఆర్టీసీ తీసుకుని వచ్చిన దర్శన్ బస్సును వినియోగించుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య సూచించారు. మంగళవారం సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్ ప్రాంతంలో ఆయన బస్సుపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కుటుంబ సమేతంగా దర్శన్ బస్సులో బిర్లా మందిర్, గోల్కొండ కోట, తారామతి బారదారి, చౌమహల్లా ప్యాలెస్, చార్మినార్, లుంబినీ పార్కు తదితర ప్రాంతాలను సందర్శించవచ్చని చెప్పారు. ఉదయం 8.30 గంటల నుంచి ఆల్ఫా హోటల్ నుంచి బస్సు ప్రారంభం అవుతుందని ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ లక్ష్మి ధర్మ, అసిస్టెంట్ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ కిరణ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అవినాష్ కళాశాల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

రాంగోపాల్‌పేట్: అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ గ్రూపునకు చెందిన విద్యార్థులకు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని సికింద్రాబాద్ బ్రాంచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర వివరాలు వెల్లడించారు. ఎల్బీనగర్ బ్రాంచ్‌కు చెందిన రింకు కుమావత్ 495, కూకట్‌పల్లి బ్రాంచ్‌కు చెందిన లిఖిత 987 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 50 మంది విద్యార్థులు టాప్-3 ర్యాంకులు, సెకండ్ ఇయర్‌లో 50 మంది విద్యార్థులు టాప్ 3 ర్యాంకులు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్ బుద్ధ, కే పట్టాభిరామ్, డీన్ అకాడమిక్స్ సుశీల కాందూరి పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి ప్రభుత్వ విద్యార్థులు..



సిద్ధు(967)

చిలకలగూడ: ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో సీతాఫల్‌మండి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఫస్టియర్‌లో 109, సెకండియర్‌లో 110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 60 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఆనందరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో సిద్ధు ఎంఈసీ 967, హేమలత సీఈసీ 926 మార్కులు సాధించగా ఫస్ట్ ఇయర్‌లో సంధ్య 476, ప్రమోద్‌కుమార్ 433 మార్కులు సాధించారు.

మహిళా ఎస్‌ఐకు వేధింపులు

- వ్యక్తికి 8 రోజుల జైలు



ప్రశాంత్

అమీర్‌పేట: మహిళా ఎస్‌ఐను ఈవ్ టీజింగ్ చేసిన వ్యక్తికి జైలు శిక్ష విధించారు. ఎస్ఆర్‌నగర్ అడ్మిన్ బాల్‌రాజ్ వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే మహిళా ఎస్‌ఐ బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం సమీపంలో వెళ్తుండగా నల్లకుంట తిలక్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ వెనకాల ద్విచక్ర వాహనంపై వచ్చి హారన్ కొడుతూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడ్డాడు. ఎందుకు అలా చేస్తున్నావంటూ ప్రశ్నించగా దురుసుగా మాట్లాడాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నాంపల్లి 10వ మెట్రోపాలిటన్ స్పెషల్ కోర్టులో హాజరు పరచ్చగా న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్‌రావు, ప్రశాంత్‌కు 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వీసీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌టీయూ (ఎఫ్) విద్యార్థులపై వీసీ ప్రొ.కవిత దర్యానిరావు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, ప్రధాన కార్యదర్శి నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులకు నోటీసులు ఇచ్చి పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్న వర్సిటీ అధికారుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హాస్టల్ సమస్యలపై ఆరు నెలల క్రితం వీసీ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారనే కారణంగా వర్సిటీకి సెలవులు ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు.

రసాయనాలతో పండ్లు పండిస్తున్న గోదాంపై దాడులు

సనత్‌నగర్: రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్న గోదాంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ ప్రాంతంలో శక్తిరాజు అనే వ్యాపారి కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి 50 కిలోల కాల్షియం కార్బైడ్‌తో పాటు 960 కిలోల మామిడి కాయలను స్వాధీనం చేసుకుని శక్తిరాజుపై కేసు నమోదు చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంటోన్మెంట్: విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత, ట్రాఫిక్ పట్ల అవగాహన కలిగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్ రాజు అన్నారు. గోపాలపురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను నివారించ వచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్, టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది శ్యామల పాల్గొన్నారు.

మెగాసిటీ పోలీసింగ్ చేయడమే లక్ష్యం



నూతన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్ సీవీ. ఆనంద్

కమిషనర్ సీవీ ఆనంద్

బౌద్ధనగర్: పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని శాంతి భద్రతలను కాపాడేందుకు నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని నగర కమిషనర్ సీవీ. ఆనంద్ అన్నారు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో నూతనంగా ప్రారంభంకానున్న వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మెగాసిటీ పోలీసింగ్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ నూతన పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే 25 సంవత్సరాల వరకు పెరిగే జనాభాను అనుగుణంగా పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామన్నారు. శాంతిభద్రతలను కాపాడటంతో పాటు మహిళలకు మరింత భద్రత కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ సిటీలోనే 35 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా లా అండ్ ఆర్డర్ డివిజన్లు, జోన్లను విభజించడం జరిగిందన్నారు. నూతనంగా లా అండ్ ఆర్డర్ సౌత్ వెస్ట్, సౌత్ ఈస్ట్ జోన్‌లతో సహా 11 ఏసీపీ డివిజన్లు, 11 లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సైబర్ క్రైమ్, నార్కొటిక్ వింగ్స్, ఐటీ సెల్, సోషల్ మీడియా సెల్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకే పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు కే. శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, దేవేందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్, డీఐ నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



చెక్కులు అందజేస్తున్న పద్మారావుగౌడ్

లాలాపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఇంటింటికీ చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. మంగళవారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల కోసం ఎవరికి డబ్బులు చెల్లించ అవసరం లేదని ఎవరైనా డబ్బులు అడిగితే సీతాఫల్‌మండిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, రామేశ్వర్, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, పి. కుమార్ వంశరాజ్ పాల్గొన్నారు.

- అనంతరం మున్సిపల్ మైదానంలో కొనసాగుతున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పద్మారావు గౌడ్ పరిశీలించి మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లో ఓబీసీ కేటగిరిలో అన్ని టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలంటూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ నేతలు మంగళవారం ఓబీసీ జాతీయ కమిషన్ చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్‌తో కలిసి చైర్ పర్సన్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ప్రత్యేక తెలంగాణ వచ్చి దశాబ్దం గడిచినా రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉద్యోగ నియామకాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విద్యార్థి వ్యరేతిక, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించే స్వరాన్ని ప్రభుత్వం నొక్కేస్తోందన్నారు. డిగ్రీ కళాశాలతో సహా రాష్ట్రంలో 8216 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా 6,276 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. వినతి ఇచ్చిన వారిలో కమల్ సురేష్, శ్రీనాథ్, పృధ్వీ, సిరివెన్నెల ఉన్నారు.